

తన పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దంపతులు -అంబర్‌పేట, డిసెంబర్ 10


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 11 డిసెంబర్ 2024 | HYDERABAD




అడ్డొస్తే కూల్చివేతలే..

నార్సింగి మున్సిపాలిటీలోని ప్రధాన రహదారిపై ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్, ట్రాఫిక్ అధికారులు - మణికొండ, డిసెంబర్ 10



ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లో.. అధికారులు కూల్చివేసిన ఇండ్ల శిథిలాల వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వివేకానంద నగర్ బస్తీ వాసులు (ఫైల్)

# పేదలను రోడ్డున పడేశారు

## గాంధీ నగర్ డివిజన్‌లో నిరాశ్రయులైన 19 దళిత కుటుంబాలు

**70 ఏళ్ల క్రితమే నిర్మించుకున్న నివాసాలు నేలమట్టం**

**నిలువ నీడ లేని స్వామి వివేకానంద నగర్ వాసుల దీనస్థితి**

**ప్రజాపాలనలో దళితులు, బడుగుల బతుకులు ఛిద్రం**

సిటీబ్యూరో, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ): పేరుకే ప్రజా పాలన.. కానీ ఆచరణలో కనిపించదు. కాంగ్రెస్‌తో దళితులకు సముచితం స్థానం అంటారు. కానీ రాత్రికి రాత్రే ఏండ్లుగా నివాసం ఉంటున్న ఇండ్లను కూల్చివేస్తారు. అంగ బలంతో, అధికార దర్పంతో దళితులు, పేదలకు నిలువ నీడ లేకుండా చేస్తారు. సమీపంలో ఉండే భారీ హైరైజ్ అపార్టుమెంట్‌కు అప్రోచ్ రోడ్డు కోసం... నిబంధనలకు విరుద్ధంగా విస్తరణ పనులు చేపట్టేస్తారు. అక్కడితో ఆగకుండా 70 ఏళ్ల క్రితమే నిర్మించుకున్న ఇండ్లను నేలమట్టం చేశారు. నివాసితులకు పరిహారం, ప్రత్యామ్నాయ నివాసం కల్పించిన తర్వాతే కూల్చివేతలు చేపట్టాలని కోర్టు ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తున్నారు. 1957 నుంచి రిజిస్ట్రేషన్లు, ఘర్ పట్టీ కడుతున్నా... దయాదాక్షిణ్యం లేకుండా ఇండ్లను కూల్చివేసి నిరాశ్రయులను చేయడంతో నగరం నడిబొడ్డున ఉన్న గాంధీనగర్ డివిజన్ పరిధిలో స్వామి వివేకానంద కాలనీలోని 19 దళిత, పేద కుటుంబాలపై ప్రభుత్వం జరిపిన బల ప్రయోగానికి ఇదొక ఉదాహరణగా నిలుస్తోంది.

గ్రేటర్‌లోని ముషీరాబాద్ నియోజకవర్గంలో గాంధీనగర్ డివిజన్, స్వామి వివేకానంద నగర్ కాలనీ 1957 కంటే ముందు ఏర్పడింది. ఒకప్పుడు ఆ ప్రాంతంలో వ్యవసాయ భూముల్లో కూలీలుగా పనిచేస్తూ, పక్కనే ఉండే పట్టా భూములను 30, 40 గజాల భూములను కొనుగోలు చేశారు. అప్పటి నుంచి గుడిసెల నుంచి రేకుల ఇండ్లకు వరకు నిర్మించుకున్నారు. ఐదు తరాలుగా అక్కడే స్థిరపడిన వారు కొందరైతే... భూములను రిజిస్టర్ చేసుకుని, ఇండ్లను కొనుగోలు చేసుకున్నారు. 10 ఫీట్లు వెడల్పు లేని ఆకీల్ షా మసీదు మార్గంలో 60ఫీట్ల రోడ్డు నిర్మాణం పేరిట పేద, దళితుల ఇండ్లను నేలమట్టం చేశారు. జనవరి 29న కనీసం నోటీసులు లేకుండా జేసీబీతో కూల్చివేసి 19 కుటుంబాలను రోడ్డున పడేశారు. దీంతో స్వామి వివేకానంద నగర్ కాలనీలో తరతరాలు నివసించిన ఇండ్లన్నీ కూలిపోయాయి.

### ఏడాది కాలంగా నిరాశ్రయులు..

ఇప్పటివరకు రెండు సార్లు సర్వే చేసిన రెవెన్యూ అధికారులే వారంతా ఆక్రమణ దారులు కాదనీ, వారిలో పట్టాదారులు కూడా ఉన్నారని నివేదించారు. కానీ జీహెచ్ఎంసీ, రెవెన్యూ, పోలీసులు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేసి జనవరిలో రోడ్డున పడేసినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇక్కడే 100 రోజుల పాటు నిరవధిక దీక్షలు చేసినా... కంటితుడుపు చర్యలుగా తమను ఓదార్చారే తప్పా తమకు తగిన న్యాయం జరగలేదని వాపోతున్నారు. డబ్బులు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకున్న భూములు కొందరివైతే... ఆస్తి పన్నులతో ఇంటి యజమానులైన ఎంతో మందిని రోడ్డున పడేశారని స్వామి వివేకానంద నగర్ బస్తీ వాసులు కంటతడి పెట్టుకున్నారు. అధికార బలంతో ధనవంతుల నివాసానికి అప్రోచ్ రోడ్డు కోసం తమ ఇండ్లను కూల్చివేశారంటూ ఆవేదన చెందుతున్నారు. కనీసం ప్రజా దర్బార్‌లో తమ గోడు వినాలంటూ కలెక్టర్‌ను ఆశ్రయించినా తమకు న్యాయం జరగలేదని, ఛీదరింపులు, ఛీత్కారాలు, బెదిరింపులు తప్పా... తమ గోడును వినలేదని ఆరోపించారు. కనీసం 2006లో కోర్టు ఇచ్చిన ఆదేశానుసారమైన తమకు న్యాయం చేయాలని, పరిహారం, పునరావాసం కల్పించిన తర్వాతే నేలమట్టం చేసి, రోడ్డును విస్తరించాలని ఆదేశించింది. కానీ నేలమట్టం చేసినా ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదని ఆరోపిస్తున్నారు.

### ఆస్తిపన్ను కడుతున్నా.. నేల మట్టం

సమీపంలో ఉండే వ్యవసాయ పొలాల్లో రైతు కూలీలైన కొంతమంది 1957లోనే భూ యజమానుల నుంచి భూములను కొనుగోలు చేశారు. ఇండ్లను నిర్మించుకుని అక్కడే జీవనోపాధి పొందుతున్నారు. అప్పటీ నుంచి ఆస్తి పన్నులు, రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించిన 19 మంది ఏడాది క్రితం ఇండ్లను నేలమట్టం చేశారు. 90 దశకంలోనే అప్పటి జిల్లా యంత్రాంగం పట్టాలిచ్చేందుకు సన్నాహాలు చేసింది. అప్పటి ముషీరాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎం. కోదండరెడ్డి హయాంలోనే పట్టాలు జారీ చేయాలని ఆదేశాలు ఉన్నాయి. కానీ అధికారులు మాత్రం ఇక్కడుంటున్న నివాసితులు భూ ఆక్రమణలదారులంటూ, అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని.. నోటీసులు లేకుండా కూల్చివేశారని నిరాశ్రయులైన దళిత, పేదలు పేర్కొన్నారు.

### ఐదు తరాలుగా ఇక్కడే..



వివేకానంద నగర్ బస్తీలో ఐదు తరాలుగా నివాసం ఉంటున్నాం. ఇక్కడే పుట్టి పెరిగాను. కోదండ రెడ్డి హయాంలోనే పట్టాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు పక్కనే ఉన్నా శతాబ్ది, జనప్రియ అపార్టుమెంట్ వాసులకు లబ్ధి చేకూర్చేలా ఈ రెండో మార్గం ఏర్పాటు చేసేలా విస్తరణకు అడ్డుగా ఉన్నాయని తమ నివాసాలను కూల్చివేశారు. 10 ఫీట్లు లేని మార్గాన్ని 60 ఫీట్లకు పెంచుతామని కూల్చివేసినా ఇప్పటికీ 30 ఫీట్ల వెడల్పు కూడా లేదు. అలాంటప్పుడు మా ఇండ్లను ఎందుకు కూల్చివేశారు. ? పరిహారం ఇవ్వకుండా, పునరావాసం కల్పించకుండా ఎందుకు కూలగొట్టారు. ఇక్కడున్న 19 కుటుంబాలన్నీ పేద, దళిత వర్గాలకు చెందినవే. అయినా ప్రభుత్వం కనికరం లేకుండా ఏడాది కాలంగా ఇండ్లను కూల్చి రోడ్డున పడేసింది.

**- ఎంవీ కృష్ణ, వివేకానంద నగర్ వాసి.**

### పరిహారంతోపాటు పునరావాసం కల్పించాలి



అధికారులు తమకున్న భూహక్కుల పత్రాలను పరిశీలించలేదు. తరాలుగా ఇక్కడే నివాసం ఉంటున్న తమ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోలేదు. దాదాపు 70ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్న వారిని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూల్చివేసి రోడ్డున పడేసింది. నిరాశ్రయులైన వారిలో పట్టాదారులు ఉన్నారు, ఆస్తి పన్నులు కడుతున్నవారు ఉన్నారు. కనీసం నిబంధనలు పాటించకుండా అర్ధరాత్రి పిల్లాపాపలను బయటకు ఈడ్చివేసి, మగవాళ్లను పోలీసు స్టేషన్లకు తరలించి, ఇంట్లో వస్తువులు కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా నేలమట్టం చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగడం లేదు.

**-ఆనంద్, స్థానికుడు.**

### గూడు కోల్పోయి రోడ్డున పడ్డాం..



స్వామి వివేకానంద నగర్ బస్తీలో మొదటి ఇళ్లు నాదే. 10 ఫీట్లు వెడల్పు లేని మార్గాన్ని 60 ఫీట్ల రోడ్డు పేరిట పక్కనే ఉన్న ఇండ్లను కూల్చివేశారు. చిన్నాచితక పనులు చేసుకుంటే బతికే పేదలను నిరాశ్రయులను చేశారు. ఏడాది కాలంగా అధికారుల దౌర్జన్యంతో, పక్కనే ఉండే అపార్టుమెంట్ వాసుల ఒత్తిళ్లకు తలొగ్గి ఆక్రమణదారుల పేరిట దశాబ్దాల కాలంగా ఉంటున్న ఇండ్లను భూమిలో కలిపివేశారు. అధికారులు కూడా ఉన్నత వర్గాలు చెప్పే తప్పుడు మాటలను నమ్ముతున్నారే తప్పా... తరాలుగా ఇక్కడే ఉంటున్న మా మాటలను పట్టించుకోవడం లేదు.

**- జ్ఞానేశ్వర్, బస్తీ వాసి**

## కొండాపూర్-సైబర్ టవర్స్ @ ఉదయం 10




కొండాపూర్ నుంచి సైబర్ టవర్స్ వరకు మంగళ వారం ఉదయం 10 గంటల సమయంలో భారీ ట్రాఫిక్ జాం అయింది. దీంతో ఉదయం ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ఇప్పటికైనా అధికారులు ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

# ఇంటి వద్ద సేవలకు స్వస్తి

## విలీనంతో తప్పని ఆన్‌లైన్ తిప్పలు

- ఇన్నాళ్లు గ్రామ సచివాలయంలోనే పరిష్కారం
- ఇకపై మున్సిపల్ కార్యాలయాలకు పరుగులు
- కాగితాల దరఖాస్తుల్లేవ్.. అంతా ఆన్‌లైన్‌లోనే
- సర్వీసు చార్జీలతో జేబులు గుల్ల.. సేవలు సున్నా
- ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల చుట్టూ తప్పని ప్రదక్షిణలు



హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడంతో సరికొత్త సమస్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపింది. పల్లెలను స్వయం ప్రతిపత్తి దిశగా నడిపించేలా బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. గ్రేటర్ చుట్టూ ఉన్న 51 గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో పాలనాపరమైన ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. గ్రామాల్లో తెల్ల కాగితం మీద దరఖాస్తు ఇస్తే సమస్య పరిష్కరించుకునే అవకాశం పోనున్నది. ఏదైనా ప్రభుత్వ శాఖలకు దరఖాస్తు చేసుకోవాలంటే ఆన్‌లైన్ సెంటర్లను ఆశ్రయించాల్సిందే. గ్రామాల్లోనూ ఈ గవర్నెన్స్ సేవలు ప్రారంభమైనప్పటికీ..ఇంటర్‌నెట్ ఆధారిత మౌలిక వసతుల లోపం కారణంగా ఆఫ్‌లైన్ ద్వారా కూడా సేవలు పొందే వెసులుబాటు ఉంది. కానీ మున్సిపాలిటీల్లోకి మారిన తర్వాత ఏ పని కోసమైనా ఆన్‌లైన్ దరఖాస్తు తప్పనిసరి. మున్సిపాలిటీలో చేరగానే పాలనా వ్యవహారాలు మారిపోనున్నాయి.

### బలహీనంగా ఈ గవర్నెన్స్..

గ్రామాలకు ఇంటర్నెట్ ఫలాలను అందించాలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ–గవర్నెన్స్ బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. గత ప్రభుత్వం కూడా అందుకు అనుగుణంగానే టీ ఫైబర్ పాలసీని రూపొందించి మిషన్ భగీరథ తరహాలో ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందేలా కృషి చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఆ దిశగా అడుగులు వేయలేదు. గ్రామ్ స్వరాజ్ పేరిట గ్రామాల్లో అందే సత్వర సేవలకు మున్సిపాలిటీల్లో కలపడంతో వీల్లేకుండా పోనుంది. గ్రామాల విలీనంతో ఈ వ్యవస్థ నిర్వీర్యం కానుండగా.. మున్సిపాలిటీల్లో అందించే సేవల కోసమైన ఆన్‌లైన్ సెంటర్లు, మీ సేవా కేంద్రాల వెంబడి తిరగాల్సిన దుస్థితి రానున్నది.

### అంతా ఆన్‌లైన్‌లోనే..

పింఛన్ కోసం సర్పంచుకో, గ్రామ సెక్రటరీకో దరఖాస్తు చేస్తే మరుసటి నెల నుంచి పింఛన్ పైసలు ఇంటికే వచ్చేది. విలీన గ్రామాల ప్రజలకు ఆ సౌకర్యం లేదు. కనీసం గల్లీలో మోరీ పారుతుందని చెప్పుకునే పరిస్థితి కూడా లేదు. అధికార వికేంద్రీకరణతోనే స్థానికంగా సేవలు అందించాల్సింది పోయి... గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసి ఇబ్బందులకు గురి చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. ప్రభుత్వం నుంచి ఏదైనా సేవలు పొందాలంటే గతంలో గ్రామ సచివాలయానికి వెళితే సరిపోయేది. ఇకపై ఆయా గ్రామాల ప్రజలు దూరంలో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కార్యాలయాలకు వెళ్లాల్సిన దుస్థితి రానుంది. మున్సిపాలిటీల్లో చేరిన తర్వాత ప్రతిదీ ఆన్‌లైన్ సెంటర్లు, మీ సేవ కేంద్రాలను ఆశ్రయించి, దరఖాస్తుల పేరిట జేబులు ఖాళీ చేసుకుంటే గానీ సాధ్యం కాదు.



# ఆమడ దూరంలో ఎల్ఆర్ఎస్!

**జీహెచ్ఎంసీలో దరఖాస్తుదారులకు చుక్కలు చూపెడుతున్న అధికారులు**

**హైడ్రా తెచ్చిన తంటాతో ఎక్కువ శాతం రిజెక్టులు**

**క్లియరెన్స్‌లో దరఖాస్తుదారుల సహనానికి పరీక్ష**

సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో లే అవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్) పథకం లబ్ధిదారుల సహనానికి పరీక్ష పెడుతోంది. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణతో ఇంటి నిర్మాణాలు చేసుకోవాలని ఆరాటపడే వారికి జీహెచ్ఎంసీ అధికారులు ముప్పుతిప్పలు పెడుతూ మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు. హైడ్రా కూల్చివేతల తంటాతో అధికారులు తీవ్ర ఒత్తిడికి లోనవుతూ కొందరు, మరికొందరు భవిష్యత్తులో మరెన్ని ఇబ్బందులు వస్తాయోనని చిన్న, చిన్న కారణాలతోనూ అప్లికేషన్స్‌ను రిజెక్ట్ చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాలు సమీపంలో ఉన్నట్టు తెలిస్తే చాలు దరఖాస్తులను ఆమడదూరం పెడుతున్నారు. ఎఫ్‌టీఎల్ ఖరారు కానీ చెరువులు, కుంటల పరిధిలోని అన్ని సర్వే నంబర్ల దరఖాస్తులు వెనక్కి పంపించేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో షార్ట్‌ఫాల్ డాక్యుమెంట్ పేరుతో దరఖాస్తుదారులను ఆందోళనకు గురి చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాలపై నీటి పారుదల శాఖ అధికారులు ఎన్వోసీ ఇస్తేనే ముందడుగు వేస్తున్నారు. ఎల్ఆర్ఎస్ ద్వారా ఖజానా నింపుకోవాలని భావించగా, హైడ్రా కూల్చివేతలు ఆ ఆశలపై గండికొట్టినట్లయింది.

క్రమబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా ఎల్ఆర్ఎస్–2020 కింద వచ్చిన దరఖాస్తులతో పాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించే ప్రక్రియ చేపట్టారు. జీహెచ్ఎంసీ పరిధిలో 1,06,891, హెచ్ఎండీఏ పరిధిలో దాదాపు 60వేలకు పైగా దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. ఈ దరఖాస్తులను క్లస్టర్ల వారీగా విభజన చేసి, ఆ తర్వాత క్షేత్ర స్థాయి పరిశీలన చేపడుతున్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన సులభంగా చేపట్టేందుకు వీలుగా గ్రామం, వార్డు, సర్వే నంబరు, కాలనీల వారీగా క్లస్టర్లుగా విభజించే ప్రక్రియను చేపట్టారు. జోనల్ వారీగా దరఖాస్తుల పరిశీలన జరుగుతున్నది. సదరు ప్లాటు ప్రభుత్వ భూమిలో ఉందా? ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా? వంటి అంశాలను పరిశీలించి... దరఖాస్తు క్రమబద్ధీకరించేందుకు అర్హత ఉందా? లేదా? అనే దానిపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అయితే ఎక్కువ శాతం ప్రొసిడింగ్స్ వరకు వెళ్లడం లేదని చాలా వరకు తిరస్కరణకు గురవుతున్నాయని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

**జీహెచ్ఎంసీలో జోన్ల వారీగా..**

| జోన్ | దరఖాస్తులు | పరిష్కార దశలో |
|---|---|---|
| ఎల్బీనగర్ | 39,234 | 4,333 |
| చార్మినార్ | 15,283 | 7,536 |
| ఖైరతాబాద్ | 5,725 | 1,264 |
| సికింద్రాబాద్ | 5,694 | 3,720 |
| శేరిలింగంపల్లి | 18,622 | 5,377 |
| కూకట్‌పల్లి | 22,362 | 11,230 |
| | 1,06,920 | 33,460 |

# డిప్యుటేషన్లకు రెడ్ కార్పెట్..!!

**పోస్టులు సృష్టించుకుని మరీ బల్దియా బాట పడుతున్న జేసీలు**

**నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్‌లు ఇస్తుండటం పట్ల ఉద్యోగుల విస్మయం**

**చర్చనీయాంశంగా మారిన అడ్మిన్ విభాగం అధికారుల పనితీరు**

సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): డిప్యుటేషన్లకు జీహెచ్ఎంసీ రెడ్ కార్పెట్ పలుకుతున్నది. రూల్స్ గీల్స్ జాన్తా నహీ..అంటూ అడ్మిన్ విభాగం అనర్హులకు పట్టం కడుతున్నది. ఇప్పటికే ఏండ్ల తరబడి డిప్యుటేషన్‌పై కొనసాగుతున్న వారికి దాసోహమైన అడ్మిన్ విభాగం.. తాజాగా నిబంధనలకు విరుద్ధంగా ప్రోత్సహిస్తున్నది. ప్రత్యేకంగా లేని పోస్టులను సృష్టించి మరీ పదవుల భర్తీ జరుపుతున్నది. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జాయింట్ కమిషనర్ (జేసీ) పోస్టులు లేవు. కేవలం జోనల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్లు ఉంటాయి. హెడ్ ఆఫీస్‌లో జాయింట్ కమిషనర్ల సేవలు అవసరం ఉండదు. కానీ ఇటీవల కాలంలో అడ్మిన్ విభాగంలో ఒక జేసీ, ఈ పోస్టు భర్తీ అయిన కొద్ది రోజుల తర్వాత ఎస్టేట్ విభాగంలో మరో జేసీ పోస్టును డిప్యుటేషన్‌తో భర్తీ చేశారు. ఈ పోస్టుల భర్తీపై ఉద్యోగ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతున్నది. అడ్మిన్ విభాగం పనితీరు పట్ల రోజు రోజు వివాదాస్పదంగా మారడం గమనార్హం. వాస్తవానికి డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులు ఒకే చోట మూడేళ్ల పైబడి ఉండకూడదు. కానీ ఏళ్ల తరబడి కుర్చీని వదలకుండా బల్దియాలోనే కొనసాగుతుండటం అడ్మిన్ విభాగం పనితీరుకు నిదర్శనం. ఎస్‌డబ్ల్యూఎం(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్) విభాగంలో ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఈఈ) 8 ఏళ్లకు పైబడి ఒకే పోస్టులో కొనసాగుతున్నాడు. సదరు ఇంజినీరుపై ఎన్ని ఫిర్యాదులు వస్తున్నా కనీసం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సదరు ఇంజినీరుపై బల్దియాలోని పేరొందిన ప్రముఖ కంపెనీ అండదండలు ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఇదే క్రమంలో వైద్య విభాగంలో ఇద్దరు ఏఎంఒహెచ్‌లు భార్గవ నారాయణ, మైత్రీ ఇద్దరు ఏళ్ల తరబడి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నారు. వీరిని మాత్ర సంస్థకు బదిలీ చేసినా వెళ్లకుండా అడ్డదారిలో బల్దియాలోనే కొనసాగుతుండటం విశేషం. కమిషనర్ జోక్యం చేసుకుని డిప్యుటేషన్లపై సమూల ప్రక్షాళన చేపట్టాలని ఉద్యోగులు కోరుతున్నారు.